క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసులలో పట్టుబడి సీజ్ చేసిన ఒక త్రిచక్ర, 34 ద్విచక్ర వాహనాలకు ఫిబ్రవరి 4న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మా నాయక్ ఆధ్వర్యంలో ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వాహనాల వేలంలో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 9 నుంచి స్టేషన్‌లో ముందస్తుగా దరావత్ రుసుము చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

నేడు కానుకమాత చర్చి వార్షికోత్సవం



ఏసుక్రీస్తు, కానుకమాత విగ్రహాలకు విద్యుద్దీపాలతో అలంకరణ

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల కానుకమాత చర్చి 26వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు చర్చిని, ఏసుక్రీస్తు, కానుకమాత వద్ద విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు దివ్యబలిపూజ, మధ్యాహ్నం కొవ్వొత్తుల సమర్పణ, సాయంత్రం పురవీధుల్లో కానుకమాత తేరు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆదివారం ఫాదర్ మార్టిన్ పసల తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న నూతన కమిటీ సభ్యులు

నడిగూడెం : మండలంలోని తెల్లబెల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని శనివారం మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మిట్టగనుపుల మోష, ఎంఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా చేకూరి కృష్ణ, ఉపాధ్యక్షులుగా నెమ్మాది స్వామి, పులిరాజు, ప్రధాన కార్యదర్శిగా నెమ్మాది కాంతారావు, కార్యదర్శిగా నెమ్మాది బాబు, కోశాధికారులుగా చేకూరి ఆనంద్‌రావు, చేకూరి సుమన్, సహాయ కార్యదర్శులుగా నెమ్మాది సురేష్, ఉపేందర్‌ను ఎన్నుకున్నారు.

జిల్లా కబడ్డీ టీమ్‌కు ఎంపిక



జిల్లా కబడ్డీ టీమ్‌కు ఎంపికైన క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : జిల్లా కబడ్డీ టీమ్‌కు చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన కబడ్డీ క్రీడాకారులు పాదిల కార్తీక్, బాణావత్ సైదులు ఎంపికైనట్లు మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నందిరెడ్డి ఇంద్రారెడ్డి, కార్యదర్శి పోటు శ్రీను ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలోని నేరేడుచర్లలో ఇటీవల జరిగిన సీనియర్ పురుషుల కబడ్డీ సెలక్షన్స్‌లో వీరు పాల్గొని ఎంపికై నట్లు తెలిపారు. వీరు ఈనెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నమెంటులో పాల్గొంటారని వారు పేర్కొన్నారు. అనంతరం వారిని అభినందించారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్

నడిగూడెం : మండలంలోని కేశవాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కొక్కిరేణి రాజమ్మ కుటుంబానికి కేఆర్ సీపురం పీఏసీఎస్ చైర్మన్ గోసుల రాజేష్ శనివారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. రాజమ్మ కుమారుడిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజమ్మ అకాల మృతి బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త ఉపేందర్, బత్తిని ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా సహాయ కార్యదర్శిగా గిరి

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన ఎనగందుల గిరి చేనేత ఐక్య వేదిక జిల్లా సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం సూర్యాపేటలో జరిగిన సంఘం సమావేశంలో నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్, అప్పం శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- జనావాసాల మధ్య ఏర్పాటు
- రక్షణ కంచె కరువు
- భయాందోళనలో ప్రజలు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు పక్కన, జానావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ ఎలాంటి రక్షణ కంచె కూడా లేదు. పాఠశాలలు ఉన్న ప్రాంతంలో కూడా ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉంచారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ప్రధానంగా బేతవోలు రోడ్డులోని చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం, జెర్రిపోతులగూడెం, రామాపురం రోడ్డులో అలాగే చిలుకూరులో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా సుమారుగా 20కు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు పక్కన జనావాసాల మధ్య, పాఠశాలల పక్కన ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని, కొన్నింటికి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు అనేకసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. సమస్యను పరిష్కరిస్తామని, ఎస్టిమేట్‌లు కూడా వేశామని అధికారులు మాటలు చెప్పడమే కాని క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.



చెన్నారిగూడెం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

చిలుకూరు మండలంలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మండల వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వాటికి ఎస్టిమేట్‌లు వేసి తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం

– మండల ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, చిలుకూరు

ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాలి

రోడ్డు ప్రక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులకు ఈ విషయాన్ని ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. తక్షణమే రోడ్డు ప్రక్కన ట్రాన్స్‌ఫార్మర్లను అక్కడ నుంచి తొలగించి రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాలి.

– సిరాపురపు శ్రీను, చిలుకూరు



చెన్నారిగూడెం నుంచి ఆచార్యులగూడెం వెళ్లే రోడ్డులో స్కూల్ సమీపాన..



బేతవోలు నుంచి చెన్నారిగూడెం వెళ్లే దారిలో..



బేతవోలు గ్రామంలో జనావాసాల మధ్య..

'మైహోం' ఆధ్వర్యంలో వైద్య శిబిరం



పాల్గొన్న పరిశ్రమ అధికారులు, వైద్యులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం స్థానిక మైహోం సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్‌సింగ్ ప్రారంభించి మాట్లాడారు. ఖమ్మం వినాయక సూపర్ స్పెషాలిటీ హస్పిటల్‌కు చెందిన డాక్టర్లు సుమారు 483 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, మైన్స్ డీజీఎం అప్పలరాజు, మైన్స్ ఏజీఎం నరేష్, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడున్నర కిలోల దెనుసు గడ్డ



చిలుకూరు : చిలుకూరు గ్రామంలో రైతు అలసకాని వెంకటయ్య తన వ్యవసాయ బావి వద్ద సెప్టెంబర్ చివరి వారంలో దెనుసు తీగను నాటాడు. ఆదివారం ఆ ప్రాంతంలో తవ్వగా మూడున్నర కిలోల దెనుసు గడ్డ (మొరం గడ్డ) లభించింది. బావి చుట్టూ దెనుసు తీగ నాటానని, ఇలాంటివి మరిన్ని దెనుసుగడ్డలు ఉండవచ్చని రైతు అంటున్నారు.

రామారావు జీవితం ఆదర్శనీయం

మునగాల : రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వక్కంతుల రామారావు జీవితం ఆదర్శనీయమని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన రామారావు శనివారం అనారోగ్యానికి గురై మృతిచెందారు. ఆదివారం రామారావు భౌతికకాయం వద్ద ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రామారావు కుటుంబం మొదటి నుంచి వామపక్ష భావజాలం కలదని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రామారావు సోదరుడు వక్కంతుల సూర్యం ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. రామారావు ఉపాధ్యాయ వృత్తితో పాటు కళలపై ఇష్టంతో సామాజిక నాటకాలు ప్రదర్శించేవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు దేవరం వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కందిబండ సత్యనారాయణ, కొక్కిరేణి మాజీ సర్పంచ్ వక్కంతుల ప్రభాకర్ పాల్గొన్నారు.



రామారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరావు, తదితరులు

ఆపదలో రక్తదానం



రక్తదానం చేస్తున్న సురేందర్

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన కనకలక్ష్మికి బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ఆమె బంధువులు డీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బాబురావును ఆదివారం సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన రక్తదాత యడ్ల సురేందర్‌ను ఫోన్‌లో సంప్రదించి రక్తం ఇప్పించారు. దీంతో వారిని పలువురు పట్టణవాసులు అభినందించారు.

7న లక్ష డప్పులు.. వేలగొంతుకల సభ



సభ కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకు ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు.. వేల గొంతుకల సభకు మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీ ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు చింతా బాబుమాదిగ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడిపాపన్న నాయకత్వంలో మద్దతు తెలిపామన్నారు. కార్యక్రమంలో బాణాల అబ్రహం, ఏర్పుల చిన్ని, పిడమర్తి బాబురావు, నాగేశ్వరరావు, స్వామి, చిన్న వెంకయ్య, సంజీవ్ రావు ఉన్నారు.

నిరుపేదల వ్యతిరేక బడ్జెట్

హుజూర్‌నగర్‌రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుపేదల వ్యతిరేక బడ్జెట్ అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోషణబోయిన హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలోని అమరవరంలో వ్యవసాయ కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 పనిదినాలు కల్పించి రోజుకు రూ. 600 ఇవ్వాలని దేశవ్యాప్త పోరాటాలు చేస్తున్నా కేంద్రం పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. పట్టణ ప్రాంత వాసులకు సైతం ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం మండల నాయకులు తేనె సీతారాములు, రైతు సంఘం నాయకులు షేక్ సైదా, లింగమ్మ, గోవిందమ్మ, వీరమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుల అహంకార హత్యలు సరికాదు

సూర్యాపేటటౌన్ : కుల అహంకార హత్యలు సరికాదని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్, ప్రముఖ న్యాయవాది ఎల్.భద్రయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు విలువలతో కూడిన విద్యను అందించి, అణగారిన కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేసినప్పుడు మాత్రమే ఈ కుల అహంకార హత్యలు ఆగిపోతాయన్నారు. యువత జీవనోపాధి కోసం మార్గాలు అన్వేషించాలి తప్ప ఈజీ మనీ కోసం రౌడీ షీటర్‌ల అవతారం ఎత్తడం మానుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా పోలీస్ శాఖ తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో వేదిక కో కన్వీనర్, సామాజిక కార్యకర్త రేపాక లింగయ్య, ప్రముఖ న్యాయవాదులు కుంట్ల ధర్మార్జున్, ఏడిండ్ల అశోక్, వేదిక సభ్యులు షేక్ కరీం, నారబోయిన వెంకట్ యాదవ్, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



కిషన్‌కు విత్తనాలు అందజేస్తున్న సందీప్‌కుమార్

మిర్యాలగూడ టౌన్ : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని పర్యావరణ ప్రేమికుడు అవిరేండ్ల సందీప్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కాలువపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ కిషన్‌నాయక్ ఏర్పాటు చేసుకున్న నర్సరీకి కావాల్సిన విత్తనాలను గాంధీనగర్ యువకుల ఆధ్వర్యంలో సేకరించిన చింత, పొగడ, ఉసిరి, సీతాఫలం తదితర విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గాంధీనగర్‌కు చెందిన కొంత మంది యువకులు ఒక టీంగా ఏర్పడి వివిధ రకాల విత్తనాలను 3లక్షల వరకు సేకరించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తన ఇంటి సమీపంలో ఖాళీ స్థలాలు ఉంటే ఒక మొక్కను నాటాలని, వచ్చే వేసవిలో స్లాబ్ ఇండ్లు ఉన్నవారు మిద్దెలపై తోటలు, మొక్కలు పెంచాలన్నారు. కాలువపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ కిషన్‌నాయక్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదంలో రెండు చేతుల కోల్పోయినా నర్సరీని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రషీద్, కనక, శ్రీను, కందికంటి రాజశేఖర్, దైద పవన్, పవన్, కె.శ్రీను, శాంతి తదితరులున్నారు.

తిరుమల బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



వెంకటేశ్వర కోలాట బృందం

నడిగూడెం: నడిగూడెం మండలంలోని రత్నవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర కోలాట బృందానికి తిరుమల, తిరుపతి బ్రహ్మోత్సవాల సందర్భంగా కోలాట ప్రదర్శనకు ఆహ్వానం వచ్చిందని టీం లీడర్ పసుపులేటి రామ వినయ్ వర్ధన్ శనివారం తెలిపారు. ఈ ప్రదర్శన 11, 12, 13వ తేదీల్లో ఉంటుందని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణ పద్మశాలీ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిట్టకోల సతీష్, ఏలే ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి వెంకటేశ్వర్లు, కార్యదర్శి మిట్టకోల మధు, రవి, ఉమాకాంత్, కడారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి



మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : అర్హులందరికీ ఇదిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డు పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండను సంక్షేమ పథకాలు అమలుకు పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపిక చేసిన సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఫ్లెక్సీకి ఆదివారం పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. పథకాల అమలులో ఎలాంటి అవినీతి అక్రమాలకు చోటు లేకుండా పారదర్శంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు మాయమాటలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, తొండపు సతీష్, నంబూరి సూర్యం, సుభాష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నాగిరెడ్డి, రఫీ, లక్ష్మయ్య, నాగరాజు, రాజారావు తదితరులు ఉన్నారు.

క్రీడా పోటీలు ఐక్యతకు దోహదం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నాయకులు, నిర్వాహకులు

కోదాడరూరల్ : క్రీడా పోటీలు ఐక్యతకు దోహదపడతాయని, సోదర భావాన్ని పెంపొందిస్తాయని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎండీ.మహబూబ్ జానీ, వైస్ చైర్మన్ బషీర్ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో లగాన్ టీం, కోదాడ జూనియర్ క్రికెటర్ల ఆధ్వర్యంలో సీనియర్స్‌కు నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన వెటరన్ క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. దాదాపుగా 40 ఏళ్ల పైబడి వారు ఈ క్రీడా పోటీల్లో యువ క్రీడాకారుల మాదిరిగా ఆడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారన్నారు. కాగా, గతంలో కోదాడకు క్రికెట్‌లో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన మాజీ క్రీడాకారులందరూ క్రికెట్ ఆడి వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. నాయకులు ఎస్‌కె.నయీం, గట్ల నరసింహారావు, పంది తిరపయ్య, గంధం పాండు, ఖదీర్, ఖాజా, ఫయాజ్, నిర్వాహకులు దస్తగిరి, అజ్జు, అతహర్, మహమూద్, షారు, సుభాని తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్వరాజ్యం

మునగాల : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం కోరారు. ఆదివారం మునగాల మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశాన్ని మండల శాఖ అధ్యక్షుడు ఎల్.నాగార్జున అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జీఓ నంబర్ 51ను సవరించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు చెల్లించాలని, ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు ఎం.వెంకన్న, ఎం.ముత్తయ్య, పరుశరాములు, రాజు, సీతారాములు, సైదులు, నాగరాజు, వీరయ్య, రఘు, టి.ముత్తయ్య, సాగర్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు

హుజూర్‌నగర్ : కేంద్ర బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు చూస్తే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను దూరం చేసేలా ఉందని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు ఆరోపించారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని శ్రామిక భవన్‌లో నిర్వహించిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. విద్యారంగానికి కేవలం రూ.1.28 లక్షల కోట్లు కేటాయించడంతో విద్యపై కేంద్ర ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థం అవుతుందని విమర్శించారు. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించేలా తెలంగాణ ఎంపీలు బడ్జెట్‌పై గొంతు విప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కె.ఉదయ్, పి.రాఖి, ఉమేష్, చరణ్, ఉదయ్, కళ్యాణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

నేరేడుచర్ల : పట్టణంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నేరేడుచర్ల, పాలకవీడు ఉమ్మడి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా దేవులపల్లి జనార్దనాచారి, ప్రధాన కార్యదర్శిగా వజ్రాల లింగాచారి, కోశాధికారిగా మదూరి కృష్ణమాచారిని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు సూరోజు సీతారాములు, ఆకారపు వెంకటేశ్వర్లు, తునికిపాటి జగన్నాధచారి, కొత్తూరు వెంకటేశ్వర్లు, ఉరిమళ్ల రామ్మూర్తి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మట్టపల్లి నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడు బోడ్డుపల్లి సుందరయ్య, మాజీ అధ్యక్షుడు దేవులపల్లి శంకరాచారి, కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడు లంకెలపల్లి శంకరాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఉద్దోజు పోతులూరాచారి, సురోజు వెంకటేశ్వర్లు, శ్రీనివాసచారి, శ్రీరాములు, బ్రహ్మచారి, ఉపేంద్రచారి, జానకిరామయ్య, పవన్, శ్రీనివాస్‌చారి, సత్యనారాయణచారి తదితరులు ఉన్నారు.

క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులు

కోదాడరూరల్ : తల్లిదండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా ప్రోత్సహించాలని ప్రముఖ వైద్యుడు జాస్తీ సుబ్బారావు అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో నిర్వహించిన ఇంటర్ స్కూల్ లెవెల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులను ఆయన అందజేసి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరకంగా దృఢంగా తయారవుతారన్నారు. విద్యార్థులు క్రీడాల్లో రాణించి రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అశోక్‌కుమార్, కొత్తపల్లి సురేష్, సిద్ధిక్, చందా శ్రీనివాసరావు, దుర్గయ్య, నాగేశ్వరరావు, సైదులు, ఖాజామియా తదితరులు ఉన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం



మిర్యాలగూడలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఎం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం సరైందికాదన్నారు. రాష్ట్రం నుంచి 8మంది ఎంపీలు ఉన్నా తెలంగాణకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేశారన్నారు. కంటితుడుపు చర్యగా ఉద్యోగులకు ఆదాయపు పన్నులో కొంత వెసులుబాటు ఇచ్చి కార్పొరేట్లకు రాయితీలు, సబ్సిడీలు కల్పించారన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు రైల్వే విషయంలో అన్యాయం చేశారన్నారు. బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్కడి రాష్ట్రానికి మాత్రమే వరాలు ఇవ్వడం మోదీ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ మంత్రులు రాష్ట్రానికి నిధులు తెచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీష్‌చంద్ర, రవినాయక్, రెమడాల పరుశురాములు, వినోద్ నాయక్, కోటిరెడ్డి, కోడిరెక్క మల్లయ్య, రాంరెడ్డి, కరీమున్నీసా బేగం, బంటు రామారావు, మట్టారెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.